కలుగొట్ల.. అభివృద్ధి కళకళ!

- రూ. 2.31 కోట్లతో మౌలిక వసతులు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఏళ్లనాటి అంతర్గత రహదారుల సమస్య పరిష్కారం
- అండర్ డ్రైనేజీ ఏర్పాటు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


రూ. 10 లక్షలతో చావిడి నుంచి దర్గా వరకు సువిశాలంగా నిర్మించిన సీసీ రోడ్డు


దుర్గమ్మ ఆలయ సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రభుత్వ భవనాలు నిర్మిస్తుండడంతో పల్లెలు పట్టణాలను తలపిస్తున్నాయి. కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలో అభివృద్ధి కాంతులు వెదజల్లుతున్నాయి. కలుగొట్ల, జోళదరాశి గ్రామాలు ఒక సచివాలయ పరిధిలో ఉన్నాయి. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో కలుగొట్లలో రూ. 2.31 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు.

రూ. 1.40 కోట్ల డీఎంఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ సచివాలయ తదితర నిధులతో గ్రామంలోని ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో నిర్మించిన సీసీరోడ్లు మెరుస్తున్నాయి. నాడు– నేడు కార్యక్రమం ద్వారా రూ. 18 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రాథమికోన్నత పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. తరగతి గదుల మరమ్మతులు, ప్రహరీ, బాత్‌రూం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

తొలగిన కష్టాలు:

ఐదు సంవత్సరాల క్రితం వరకు గ్రామంలోని బీసీ, ఎస్సీ, కాలనీల్లో సీసీరోడ్లు లేక చిన్న పాటి వర్షానికే వీధులన్నీ బురదమయమై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు జనం. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు బురద మయంగా ఉన్న దారుల్లో నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురిగునీరంతా వీధుల్లో పొంగి పారుతుండేది. ఆయా కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతూ దోమలు విలయతాండవం చేసేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయా కాలనీల్లో అంతర్గత రహదారుల కష్టాలు తొలగిపోయాయి. జలజీవన్ మిషన్ నిధులు రూ. 70 లక్షలతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల ఏర్పాటు కలుగొట్ల గ్రామం కళకళలాడుతోంది. కలుగొట్ల, జోళదరాశి గ్రామాల అభివృద్ధికి చొరవ చూపిన ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు గ్రామస్తులు.


రూ. 20 లక్షలతో ప్రధాన రహదారి నుంచి ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు


నాడు- నేడు నిధులతో మారిపోయిన ప్రాథమికోన్నత పాఠశాల రూపురేఖలు

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- చావిడి నుంచి దర్గా వరకు రూ. 10 లక్షలతో సీసీరోడ్డు
- రూ. 15 లక్షలతో పెద్దనాయుడు ఇంటి నుంచి రామసుబ్బమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు
- రూ 20 లక్షలతో ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీకి సీసీ రోడ్డు
- రూ. 45 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం
- రూ. 18 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- రూ. 70 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు
- రూ. 25 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు
- రూ. 25 లక్షలతో బీసీ కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణం
- రూ. 3 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రావెల్ రోడ్డు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత కల్పించాం. ఎస్సీ, బీసీ కాలనీలు చిన్నపాటి వర్షానికే బురదమయమం అయ్యేవి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. కోటికి పైగా మంజూరు చేయించారు. ఆ నిధులతో వేసిన సీసీరోడ్లు కళకళలాడుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, కలుగొట్ల

నాడు- నేడుతో మారిన స్కూల్ రూపురేఖలు



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మా గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 18 లక్షలు మంజూరు చేసింది. గదుల మరమ్మతులు, కొత్తగా బాత్‌రూంలు, మరుగుదొడ్లు నిర్మించడంతో విద్యార్థులు కష్టాలు తీరిపోయాయి.

– లక్ష్మినారాయణ, కలుగొట్ల

తాగునీటి సమస్య తీరినట్లే



గ్రామ ప్రజలకు మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటుతోపాటు వివిధ పథకాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో శాశ్వతంగా తాగునీటి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో నీటి సమస్య తీరినట్లే.

– ప్రభాకర్‌రెడ్డి, కలుగొట్ల

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : ఎన్నికల నిర్వహణపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని బనగానపల్లె నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు మే 13న జరిగే ఎన్నికల పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకే పోలింగ్‌బూత్‌లకు చేరుకోవాలని, 7 గంటలోపు పోలింగ్ బూత్‌ల్లో ఉన్న రాజకీయ పార్టీల ఏజెంట్లతో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం ఓటర్లను ఓటు వేసేందుకు పోలింగ్‌బూత్‌ల్లోకి అనుమతి ఇవ్వాలని సూచించారు.

బంక్‌ను నెట్టేసిన టీడీపీ నాయకులు


బేస్ మట్టం నుంచి పక్కన పడివున్న బంకు

కొలిమిగుండ్ల: టీడీపీ నాయకుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయి. బెలుం గుహల సమీపంలోని ప్రధాన రహదారి పక్కలో ఉన్న ఐరన్ చేసిన బంక్‌ను శనివారం బెలుంకు చెందిన టీడీపీ నాయకులు మద్యం ఫుల్‌గా తాగి పక్కకు నెట్టేశారు. గ్రామానికి చెందిన మారం శేఖర్ ఇటీవల రోడ్డు పక్కలో బేస్ మట్టంపై ఐరన్‌తో తయారు చేయించిన బంక్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. అయితే 15మందికి పైగానే టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా బేస్ మట్టం నుంచి బంక్‌ను కిందకు తోసేశారు. బాధితుడు శేఖర్ ఫిర్యాదు మేరకు సీఐ గోపీనాథ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఉపాధి పనులు కల్పించండి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

మహానంది: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులను కల్పించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలోని ఫీడర్ ఛానల్ పనులను శనివారం పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి కూలీలతో కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా లేబర్ బడ్జెట్ మరియు సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ ఆధారంగా కుటుంబాలకు, వ్యక్తిగత కూలీలకు ఉపాధి పనులను విరివిగా కల్పించాలన్నారు. పనులకు ఎంతమంది వస్తున్నారు, జాబ్ కార్డులు ఎంత మందికి ఉన్నాయి, చురుకుగా పని చేసే కూలీలు ఎంతమంది ఉన్నారు, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ఆపరేట్ చేసే విధానంపై ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏప్రిల్, మే, జూన్ మాసాలలో ఉపాధి హామీ పనులను ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు. పనులు చేస్తున్న ప్రాంతాలలో కూలీలు వడదెబ్బకు గురికాకుండా షేడ్ నెట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తదితరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఉదయం 6 గంటలకే ఉపాధి హామీ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో నర్సరీ ప్లాంట్‌ను పరిశీలించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


గోరుమానుకొండలో యువకులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోరుమానుకొండ, తాండ గ్రామాల్లో శనివారం సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామనాథం, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బుగ్గన అర్జున్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ ప్రభుత్వ పాలన, గత టీడీపీ పాలనకు తేడా గమనించాలన్నారు. అర్హతనే ప్రమాణికంగా గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు వర్తింపజేశారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాముడు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, నాగేశ్వర్‌రెడ్డి, హరి, వీర భద్రుడు, రాజయ్య, వెంకటేశ్వర్లు, రామయ్య, మల్లికార్జున, గోవిందు, శ్రీను పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టులు, కామెంట్లకు అడ్మిన్‌లదే బాధ్యత

డోన్ టౌన్ : ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో వివాదాస్పద కామెంట్లు, పోస్టులు పెట్టే సభ్యులను ఆయా గ్రూపుల నుండి తొలగించాలని, ఇలాంటి వాటికి ఆ గ్రూపు అడ్మిన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అడ్మిన్ గ్రూపులోని ప్రతి పోస్టింగ్‌ను పరిశీలిస్తూ వివాదాస్పద పోస్టింగ్‌లపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇలాంటి పోస్టింగులు పెట్టిన సభ్యులపై చర్యలు తీసుకోకుంటే అడ్మిన్ కూడా నేరస్తుడే అవుతారన్నారు. సోషల్ మీడియాలో ఇతరులకు చెందిన వ్యక్తిగత పోస్టులు, వీడియోలు, విద్వేషాలు రెచ్చగొట్టేవి, మార్ఫింగ్ పోటోలు, వీడియోలు, దేశ భద్రతకు ముప్పు కలిగించే తదితర తప్పుడు వార్తల పోస్టింగ్‌లు చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి గ్రూపు అడ్మిన్ తప్పని సరిగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని సౌత్ ఇండియా కార్యాలయం ఆవరణలో పూదోట శివ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాతల సహకారంతో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణ ప్రజలతో పాటు మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ చేసినట్లు బుగ్గన మహేశ్వర్ రెడ్డి, రమేష్ బాబు, నాగమోహన్ తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్ రెడ్డి

డోన్ టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 17వ వార్డులో శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు బోయ కళావతి, షాధిక్, శరత్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేదల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వ అములు చేస్తున్న సంక్షేమ పథకాలు స్థానికులకు వివరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్, మిట్టా రవికుమార్, దారా ప్రతాప్‌రెడ్డి, పెండేకల్లు హుస్సేన్, అశోక్, వెంకటేష్, ఆదాం, భాస్కర్ పాల్గొన్నారు.

28వ వార్డులో ...

పట్టణ పరిధిలోని 28వ వార్డులో శనివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.3,500 కోట్లతో డోన్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. దళారీల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజలకు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి,ఆర్ట్ రమణ,మేకల విమల,సుంకన్న,వెంకట్రాముడు,పార్టీ జిల్లా బీసీ విభాగం అధక్షులు పోస్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు


రూ. 13.64 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న దృశ్యం

చురుగ్గా అభివృద్ధి పనులు

కోవెలకుంట్ల: మండలంలోని గుంజలపాడు గ్రామంలో రూ. 50.64 లక్షలతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామ ప్రజలకు శాశ్వత తాగునీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో జలజీవన్ మిషన్ ద్వారా రూ 37 లక్షలు మంజూరయ్యాయి. రూ. 25 లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అదే విధంగా రూ. 12 లక్షలతో గ్రామంలోని ఆయా కాలనీల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి అయితే గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తీరిపోయినట్లే. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13.64 లక్షలు కేటాయించింది. ఈ మేరకు ఆ నిధులతో అంగన్‌వాడీ భవనాన్ని అన్ని హంగులతో నిర్మిస్తున్నారు.


రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు

సారా కేసు నిందితుడికి రిమాండ్

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన వ్యక్తిని నాటుసారా కేసులో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్ బాబు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గుర్రాల కంబగిరి స్వామి నాటుసారాను అమ్ముతుండగా దాడి చేసి, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని తెలిపారు. అనంతరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఏసుక్రీస్తు బోధనలను అనుసరించాలి


రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: ఏసుక్రీస్తు బోధనలను ప్రజలు అనుసరించాలని స్థానిక పాస్టర్లు సుందర్ కుమార్, డేవిడ్ శీను, సామేలు శివయ్య, వెంకటేశ్ తెలిపారు. గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో భాగంగా శనివారం స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి సీయోను ప్రార్థనా మందిరం వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలను ప్రజలకు వివరించారు. ఏసుక్రీస్తు అందరికీ రక్షకుడన్నారు. ఏసుమార్గంలో నడిచిన వారికి ప్రభువు అన్ని వేళలా తోడుగా ఉంటారని వారు తెలిపారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్ : స్థానిక షాదీఖానాలో శనివారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డోన్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. మాస్టర్ ట్రైనర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎన్నికల నియమావళిలో భాగంగా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల తహసీల్దార్లు మాధవకృష్ణారెడ్డి, జీవన్‌చంద్రశేఖర్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సువార్త ర్యాలీ


క్రీస్తు సువార్తలను వినిపిస్తున్న పాస్టర్లు

డోన్ టౌన్ : గుడ్ ఫ్రైడే వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సువార్త ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, సంఘ పెద్దలు బర్నబాస్, ప్రభుదాస్, చరణ్‌రాజ్, ఆదాం, ప్రవీణ్‌కుమార్, జాన్సన్‌బాబు, పవన్ కుమార్, ఝషువా యేసుక్రీస్తు మహిమలను విశ్వాసకులకు బోధించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి


తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని 503 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా నాయకులు చిన్నరమిమాన్‌లు కోరారు. ఈ మేరకు శనివారం వారు తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొంత మంది అక్రమార్కులు 503 సర్వే నంబరును రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై ప్రైవేట్ భూమిగా రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. అధికారులు పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అపరాధ రుసుం లేకుండా ఇంటి పన్ను

బేతంచెర్ల: బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి రోజు ఆదివారం ఇంటి పన్ను చెల్లించి అపరాధ రుసుం నుంచి మినహాయింపు పొందాలని కమిషనర్ రమేష్ బాబు ప్రజలకు సూచించారు. పట్టణ ప్రలజ సౌకర్యార్థం ఆదివారం నగర పంచాయతీ కార్యాలయం తెరిచి ఉంటుందని, ఇంతవరకు ఇంటి పన్నులు చెల్లించని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండె పోటుతో లారీ క్లీనర్ మృతి

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం లారీ క్లీనర్ గుండె పోటుతో మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా బొబ్బర్లపాడు గ్రామానికి చెందిన గురక రామిరెడ్డి(43) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో మట్టిని అన్‌లోడ్ చేసేందుకు వచ్చారు. అన్‌లోడ్ టైమింగ్ రాక పోవడంతో వేచి ఉన్నారు. ఛాతిలో మంటగా ఉండటంతో ఈనో తాగాడు. అనంతరం కుళాయి వద్ద ముఖం కడుక్కునేందుకు వెళ్తూ కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : చిన్న మల్కాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7గంటల వరకు మల్కాపురం, బేతంచెర్ల, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, ఫ్యాక్టరీలకు కరెంట్ ఉండదన్నారు. వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా చేస్తామని వివరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని పేరుసోములలో ఓ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఆళ్లగడ్డ మండలం జమ్ములదిన్నె గ్రామానికి చెందిన వెంకట రమణ కొంత కాలం నుంచి సంజామల మండలం పేరుసోముల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం పేరుసోముల ఊరు బయట ఉన్న కాల్వ దగ్గర వెంకట రమణ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

3న ఒంగోలుజాతి వృషభాల రాతి దూలం పోటీలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరులో వెలసిన పెద్దమ్మ 16వ రోజు పండుగ సందర్భంగా ఏప్రిల్ 3న అఖిల భారత ఒంగోలు జాతి వృషభరాజముల రాతి దూలం లాగుడు పోటీలు ప్రారంభమవుతాయని అమ్మవారి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. విజేత వృషభాల యాజమాన్యాలకు రూ. 50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున బహుమతులను దాతల సహకారంతో అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.